క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మార్కెట్ సమీపంలో ధ్వంసమైన మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ శనివారం ఎంపీడీవో నరేష్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. నాలుగు రోజుల క్రితం మురికి కాల్వ మరమ్మతుల కోసం కాల్వ పూడిక తీస్తుండగా పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో పలువురి ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సాయిలు, జీపీ సిబ్బంది ఉన్నారు.

నాగిరెడ్డిపేట పశువైద్యాధికారిగా రవికుమార్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల పశువైద్యాధికారిగా డాక్టర్ రవికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇదివరకు పశువైద్యాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ మారుతి గత జనవరి 15న బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. అప్పటి నుండి లింగంపేట పశువైద్యాధికారి రవికుమార్ నాగిరెడ్డిపేట మండల ఇంచార్జీ బాధ్యతలు నిర్వహించారు. కాగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా లింగంపేట మండల పశువైద్యాధికారిగా ఉన్న రవికుమార్ నాగిరెడ్డిపేటకు వచ్చారు. కాగా తాండూర్ పశువైద్యశాలలో జేవీవోగా విధులు నిర్వహించిన సతీష్ బదిలీపై మెదక్‌జిల్లాకు వెళ్లారు. ఆయనస్థానంలో జేవీవో అరుణ్‌కుమార్ బదిలీపై గజ్వేల్ నుండి తాండూర్‌కు వచ్చారు.

గ్రామాల్లో జ్వర బాధితుల సర్వే



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బోనాల్, నాగారం, లింగంపేట తదితర గ్రామాల్లో జ్వర బాధితుల సర్వే, లార్వా సర్వే చేసినట్లు మండల వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వారం రోజుల కంటే ఎక్కువ నీళ్లు నిల్వ ఉంచవద్దని సూచించారు. కాచి చల్లారిన నీటిని తాగాలని సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న 21 మంది రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేసి నెగెటివ్ రాగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త అవసరం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పట్టణంలోని గురుకుల పాఠశాల, గండిమాసానిపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తినే ముందు చేతులను బాగా శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

'మధ్యాహ్న' సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎండీఎం నిర్వాహకుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎండీఎం నిర్వాహకులు శనివారం ఎంఈవో వెంకటేశంకు వినతిపత్రం అందించారు. ఎండీఎం నిర్వాహకులకు గుడ్లు, గ్యాస్ సరఫరాతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను చెల్లించాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

రోడ్డును బాగు చేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డును బాగు చేయించాలని అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు. వర్షాకాలంలో వర్షంతో రోడ్డుతో బురదమయంగా మారుతోందంటున్నారు. తాడ్వాయి చెరువు నుంచి వచ్చే నీరుతో రోడ్డు మధ్యలో కల్వర్టు లేక రోడ్డు తెగి అంతరాయం ఏర్పడుతోందన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు..

- కంచర్ల, సదాశివనగర్‌లో ఉత్సాహంగా బోనాల ఊరేగింపు
- పాఠశాలల్లోనూ కార్యక్రమాలు..



కంచర్లలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

భిక్కనూరు : మండలంలోని కంచర్ల గ్రామంలో ఆషాఢమాసం సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున శనివారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలో ఉన్న 221 కుటుంబీకులు గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు. గ్రామంలోని గ్రామ దేవతలకు బోనాలను భాజభజంత్రీలతో సమర్పించి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు అలరించాయి. వానలు బాగా కురిపించి పంటలు బాగా పండేలా చూడాలని గ్రామదేవతలకు మొక్కులు మొక్కుకుని ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమ్మరి చంద్రం, కుమ్మరి సంఘం ప్రతినిధులు భూస్వామి, సిద్ద రాములు, స్వామి, పల్లె వెంకటి, కర్రోళ్ల నవీన్, సిద్ద రాములు, తిరుపతి తదితరులున్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యాలయంలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు బోనాలను అలంకరించి వినూత్నంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవి పబ్లిక్ స్కూల్‌లో..

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ సాంప్రదాయమైన బోనాల పండుగను స్థానిక వాసవి పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. విద్యార్థులు బోనాలను సిద్ధం చేసి అమ్మవారికి ఆటపాటలతో వైభవంగా నైవేద్యాలను సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంబరం నిర్వహించారు. బోనాల సమర్పణతో అమ్మవారు చల్లగా చూస్తుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాసవి పబ్లిక్ స్కూల్‌లో బోనాలతో విద్యార్థులు

నేడు ఎల్లారెడ్డిలో బోనాల పండుగ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ముత్యాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ముత్యాల పోచమ్మ బోనాల పండుగకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. సిరిసిల్లా డప్పు వాయిద్యాలతో బోనాల ఎదుర్కోలు కార్యక్రమం, ఊరడమ్మకు, ముత్యాల పోచమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బోనాల పండగను విజయవంతం చేయాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.

పండుగకు తరలిరావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో ఆదివారం జరిగే బోనాల పండుగ కార్యక్రమానికి తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ముత్యాలమ్మ, పోచమ్మ గ్రామదేవతలకు బోనాలు తీయడమే కాకుండా పలారం బండి జాతర ఉంటుందన్నారు. ఈ బోనాల పండుగకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు తాడ్వాయి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు.



ఎల్లారెడ్డిలో ముస్తాబైన పోచమ్మ ఆలయం

అధికారులకు బదిలీలు సహజమే..



దోమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న సిబ్బంది



గాంధారిలో అధికారులను సన్మానించిన ఎంపీడీవో

విధినిర్వహణలో భాగంగా ప్రభుత్వ అధికారులకు, ఉపాధ్యాయులకు బదిలీలు సహజమేనని ఆయా పదవులకు న్యాయం చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని వక్తలు పేర్కొన్నారు. శనివారం పలువురు అధికారులను, ఉపాధ్యాయులను సన్మానించారు. – దోమకొండ/గాంధారి/పెద్దకొడప్‌గల్/సదాశివనగర్/నిజాంసాగర్ /నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి)



పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డికి..



సదాశివనగర్‌లో పంచాయతీ కార్యదర్శులకు..



నిజాంసాగర్‌లో ఉపాధ్యాయులకు..



నాగిరెడ్డిపేటలో..

సైబర్‌నేరాలపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాగిరెడ్డిపేట ఏఎస్సై లచ్చీరాంనాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని బస్టాండ్‌ప్రాంతంలో ప్రయాణికులకు శనివారం ఆయన సైబర్‌నేరాలపట్ల అవగాహన కల్పించారు. వాట్సప్‌లలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే ఓటీపీ చెప్పవద్దన్నారు. కానిస్టేబుల్ దేవయ్య ఉన్నారు.

చట్టాలపై ..



గాంధారి(ఎల్లారెడ్డి) : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎల్లారెడ్డి న్యాయమూర్తి హారిక అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్ల వయస్సు వచ్చేవరకు పెళ్లిళ్లు చేసుకోరాదని, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాలికలు, యువతుల ఎవరైనా వేధించినట్లయితే వెంటనే పోలీసులు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండగా..

భిక్కనూరు : అవయవదానం చేసిన వ్యక్తి కుమార్తెకు పదోతరగతి వరకు విద్యతో పాటు పుస్తకాలు, డ్రెస్సులు ట్రాన్స్‌పోర్ట్‌ను ఉచితంగా అందజేసేందుకు మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం శనివారం ముందుకొచ్చింది. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్ ఇటీవల బ్రెయిన్‌డెడ్ కాగా ఆయన కుటుంబీకులు ప్రవీణ్ అవయవాలను దా నం చేశారు. ప్రవీణ్‌కు భార్య రేఖ, కుమార్తె ఉద్విత, ఏడాదిన్నర వయస్సు కుమారుడు అద్విత్ ఉన్నారు. అయితే చిన్నారి ఉద్వితకు పదో తరగతి వరకు ఉచిత విద్యా, సౌకర్యాలు కల్పించేందుకు విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్ ముందుకొచ్చి అంగీకార పత్రాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. ఉద్వితకు 1వ తరగతిలో ప్రవే శం కల్పించారు. బాలుడు అద్విత్‌ను కూడా తమ స్కూల్‌లో చేర్పిస్తే పదో తరగతి వరకు కూడా ఉచిత విద్య, ఇతర సౌకర్యాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేసిన ప్రవీణ్ భార్య రేఖ విజయభాస్కర్‌రెడ్డికి, ఇందూరు ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మెజీషియన్ సంతోష్, సరే ష్‌రెడ్డి, రవి, నరేష్, రాజేందర్‌లు పాల్గొన్నారు.



అంగీకారపత్రాన్ని అందజేస్తున్న విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బాన్సువాడ : పట్టణంలోని సింధూ విద్యాలయంలో శనివారం సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రఘుతేజ, సంగ్రాం, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఆస్పత్రి యాజమాన్యం ప్రవీణ్‌రెడ్డి, హెచ్‌ఎం జిన్న జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామంలో చేపట్టిన పారిశుధ్యం పనులను ఎంపీడీవో నరేశ్ శనివారం పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. గ్రామాల్లో పర్యటించారు. జీపీ ఆవరణలో మొక్కలునాటారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, కార్యదర్శులు అశ్వక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన మహోత్సవం



మహమ్మదాబాద్ శ్మశాన వాటికలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాస్



బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నిజాంసాగర్(జుక్కల్) : ఇంటింటా మొక్కలు నాటి వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. శనివారం జుక్కల్ మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ శ్మశానవాటికలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షించడం అంతకన్న ముఖ్యమని అన్నారు. కౌన్సిలర్ బాడి శ్రీనివాస్, హెచ్‌ఎం సాయిలు, నాయకులు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు నరహరి, మోహిన్ తదితరులు ఉన్నారు.

అమ్మకోసం మొక్కలు నాటి..

నిజాంసాగర్(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ తల్లులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణను పిల్లలు బాధ్యత తీసుకోనున్నారు. పాఠశాల హెచ్‌ఎం రాంచందర్, టీచర్లు వెంకటేశం, వెంకటి, శైలజ పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): మండలంలోని కుర్తిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి ఆరు మొక్కలను గ్రామ పంచాయితీ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ మొక్కలను సంరక్షించాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కాశీరాం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లో..



కుర్తిలో మొక్కలు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యార్థినికి ఆర్థికసాయం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లుబెల్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్, దుండిగల్‌లో సీఎస్‌ఈ(ఏఐఎంఎల్) కన్వీనర్ కోటాలో సీటు సాధించిన వైష్ణవిని సన్మానించారు. అనంతరం ఆమె హాస్టల్ ఫీజు కోసం రూ.1,15,000 చెక్ అందచేశారు. ఈ సందర్భంగా లయన్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ వైష్ణవిని పిట్లం లయన్స్ క్లబ్ దత్తత తీసుకుని ఆర్మూర్‌లోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్‌లో రూ. 1,35,000 హాస్టల్ ఫీజు చెల్లించామన్నారు. ఇటీవల ఈసీఈటీ ఎంట్రెన్స్‌లో 2157 ర్యాంక్ సాధించి కన్వీనర్ కోటాలో వైష్ణవి సీటు సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, జోన్ చైర్మన్ కిషన్, సభ్యులు తదితరులున్నారు.



చెక్కును అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సన్మానాలు..

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా సన్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్సీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అధ్యక్షుడికి..



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల కమిటీని ఉపాధ్యాయులు సన్మానించారు. మండల అధ్యక్షుడిగా జి.హన్మాండ్లు వరుసగా మూడోసారి ఎన్నికవడం అభినందనీయమని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చందర్ అన్నారు.

విద్యార్థినులకు..



మాచారెడ్డి : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినులు జువేరియా, లక్ష్మీ ప్రసన్న, జస్మితలను శనివారం గ్రామ నేస్తం అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అలాగే గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగం సాధించిన అదే గ్రామానికి చెందిన అమీర్ పాషాను సన్మానించారు. కార్యక్రమంలో నేస్తం అధ్యక్షులు షాబుద్దీన్, కోశాధికారి బాల్ కిషన్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

శాకంబరిగా రేణుకా ఎల్లమ్మ



భిక్కనూరు : మండల కేంద్రంలోని రేణుకాదేవి ఎల్లమ్మను శాకంబరిగా శనివారం అలంకరించారు. అలాగే రేణుకాదేవి ఎల్లమ్మతో పాటు అమ్మవారి కుమార్తె అయిన నీలగౌరి విగ్రహాన్ని కుమారుడు పరుశురాం విగ్రహాన్ని, భర్త అయిన జమదగ్ని మహర్షి విగ్రహాలకు కూడా కూరగాయల దండలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా గ్రామదేవతల ఆలయ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని గోలిలింగాలలో పోచమ్మ,, దుర్గమ్మ ఆలయాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లోని అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, గ్రామంలోని ప్రతిఒక్కరూ బాగుండాలని గ్రామదేవతలను వారు వేడుకున్నారు. అనంతరం గ్రామంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు.



వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు సిద్దిరాం రెడ్డి, గంగారం, సూర్యం, రాంచంద్రం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మధ్యాహ్న భోజన నాణ్యతపై అసంతృప్తి

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యత బాగాలేదని బీజేపీ పార్టీ నాయకులు అన్నారు. శనివారం తాము పాఠశాలను సందర్శించగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆరోపించారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయమై ఎంఈవో నాగేశ్వరరావుకు ఫిర్యాదుచేయగా ప్రధానోపాధ్యాయులు ఫకీరయ్యను మందలించారన్నారు.

సర్కార్ బడిలో గుడ్ల మాయంపై విచారణ

రామారెడ్డి : విద్యార్థులకు పెట్టాల్సిన కోడిగుడ్లను పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ బ్యాగులో గుర్తించిన ఘటనకు సంబంధించి ఎంఈవో యోసెఫ్ పోసానిపేట పాఠశాలలో శనివారం విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు తానే బ్యాగులో పెట్టుకున్నట్లుగా అంగీకరించిందని ఎంఈవో యోసెఫ్ తెలి పారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

మోడల్ పాఠశాలలో నో బ్యాగ్ డే

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాలలో నాల్గో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. 6,7,8 తరగతుల విద్యార్థులు గీసిన సైన్స్ చిత్రాలు, పరికరాల అవశ్యకత, వాటి ఉపయోగంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులను టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఉపాధ్యాయులు అనురాధ, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

రైతు రుణాలు ఫ్యాక్టరీయే చెల్లించాలి

కామారెడ్డి రూరల్ : బ్యాంకులో రైతుల పేరిట తీసుకున్న రుణాలన్నింటిని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యమే చెల్లించాలని సదాశివనగర్ మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి అన్నారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకులో రైతుల పేరుతో ఉన్న రుణాలే కాకుండా ఇతర బ్యాంకులో ఉన్న రుణాలు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లో రైతులందరికీ రుణాలు కట్టకపోతే అందరి రైతులతో ఆందోళన ఉధతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, గాంధారి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శివాజీ రావు, మాజీ జెడ్పీటీసీ కో–ఆప్షన్ మొహినోద్దీన్, సదాశివ నగర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

కామారెడ్డి రూరల్ : పట్టణంలోని 38 వార్డు శ్రీరాం నగర్ కాలనీకి చెందిన పగడాల శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడగా తలలో రక్తం గడ్డకట్టిగా ఆస్పత్రిలో చేర్పారు. ఆయన కుటుంబీకులు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ని సంప్రదించడంతో సీఎంఆర్‌ఎఫ్ కింద ఎల్వోసీ మంజూరు చేయించారు. ఈమేరకు శనివారం రూ.2.5 లక్షల ఎల్వోసీని హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబీకులకు షబ్బీర్ అలీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చాట్ల వంశీ, పద్మశాలి పట్టణ సంఘం అధ్యక్షుడు చాట్ల రాజేశ్వర్ తదితరులున్నారు.